

# భిక్షుక బాలుడు

[ఆకాశాన్నిఅంటే మేడ. వీధిద్వారంమాత్రం ఎంచేతో బూజుపట్టిఉంది. లోపల మనుష్యులసందడి ఆట్టే ఉన్నట్టు కనబడదు. వాలకంబట్టిచూస్తే ఆయింట్లో ఇద్దరు ముగ్గురుకన్న ఎక్కువఉన్నట్లు కనపడదు. పెరటిద్వారంలోంచి ఎంగిలివిస్తరాకులు పట్టుకొనివచ్చి అవతల గిరవాటేసి ఎక్కణ్నుంచో 'అమ్మా' అను పిలుపు వినబడడంచే గుమ్మంలోనే నిలబడింది ఆమె. సుమారు ముప్ఫయిసంవత్సరముల వయస్సు. ముఖంలో మార్దవరసం ప్రవహిస్తోన్నట్టు కనుపిస్తుంది. చూపుల్లో కరుణ వరదలై పారుతోంది. మొత్తంమీద పరిమళహృదయమే. పట్టుచీర కట్టుకుంది. అలా నిలబడి చూస్తుంటే కరడుకట్టిన కరుణమూర్తిలాఉంది ఇంతలో చిల్లిపింగాణీకంచం నెత్తిమీద బోర్లించుకొని వచ్చాడో పిల్లాడు. మెళ్ళో నాలుగువరుసల వేరుపూసల దండలు, తైలసంస్కారం లేకపోవడంచేత మొహంమీదికి పడే ఎర్రనిముంగురులు, చేతులకి రాగిమురుగులు, జబ్బలదగ్గర వేరుపూసలకడియాలు, కోలనిముక్కు, చిన్నగోచీ పెట్టుకున్నాడు వెనకపక్కకు ఒదిలిన గోచీకొంగు పీలికలై ఉంది వాలకంబట్టి చూస్తే వాడో భిక్షుకకుటుంబానికి చెందిన పిల్లాడని తెలుస్తుంది. ముష్టి అడగడంతెలియదు. ప్రపంచకాన్నిమాత్రం స్వాతంత్ర్యదృష్టితో చూస్తున్నాడు. ప్రపంచకంఅంతా ఒకఇల్లు. అది తనదీ అని వాడిభావన. ఆకలేసేసమయాన్కి ఏ ఇల్లాలినిఅడిగినా తల్లిలా ఆదరించి ఇంతఅన్నం పెట్టుతుందని వాడిభావం. తనగుడిసెలోఉండే తల్లిదండ్రులం దెంతప్రేమో తనకి లోకంలోఉండే స్త్రీపురుషాదులందుకూడ అంతేప్రేమ. తనగుడిసెలోతనకి ఎంత స్వాతంత్ర్యమో ఇతరులఇంట్లోకూడా తనకి అంతేస్వాతంత్ర్యంఉందని వాడనుకునేవాడు. తనతల్లి తనని ఎల్లా చూస్తోందో లోకంకూడా అల్లా చూస్తుందని వాడి వెర్రి ఉద్దేశం. ఇంకా లేతమనస్సుకాబట్టి కలుషప్రపంచకంలో ఉండే దుర్గంధం వీడి కేంతెలుసు? గబగబా పరుగెత్తుకొనివెళ్ళి కంచం కిందపడేసి కాళ్ళు చాపుకొని కూచుని 'అమ్మా నా కాకలేస్తోందే' అన్నాడు.]

ఆమె—(జాలిగా వాడికేసి చూసి) ఎవరమ్మా నువ్వు?

బాలుడు—నేను.

ఆమె—నీపేరేరమ్మా?

బాలుడు—నాపేరు పాప?

ఆమె—మీయింటిపేరు?

బాలుడు—మాయిల్లు కొబ్బరాకులది.

ఆమె—అదికాదమ్మా! మీయింటిపేరు?

బాలుడు—అహ! అదా! బిచ్చమెత్తుకొనే ఇల్లు.

ఆమె—అయ్యో! పాప! నీ కన్నీ ఒట్టింటాయి! నీకు సరిగ్గా మాటలు రావా, నాయనా?

బాలుడు—ఆఁ! నేచెప్పను. నాకు ముందన్నం పెట్టు. నా కాక లేస్తోంది.

ఆమె—పోనీలే అన్నంతిన్నాక చెబుదుగానిలే. ఇక్కడే కూచో. అన్నం పట్టుకొస్తా. [లోపలికి వెళ్లితోంది].

బాలుడు—[స్వతంత్రంగా ఆమె వెనక్కాలే వెళ్ళి ఆమెకొంగు పట్టుకొని వెనక్కాల నడుస్తున్నాడు.

పాపం వాళ్ళు బ్రాహ్మలనీ ఆమెది అంటచెయ్యికాబట్టి ముట్టుకోకూడదనీ తెలీదు] అమ్మా! ఏంవేసి పెడ తావు అన్నంలో?

ఆమె—[చటుక్కున వెనక్కి తిరిగి చూసి] అయ్యో! పాప! ముట్టుకున్నావా? పోనీ స్నానం చేస్తాలే. నిన్ను వాకట్లో ఉండమంటే ఇలావచ్చావేం? [శాంతంగా] వాకట్లో ఉండు. అన్నం పట్టుకొస్తా

బాలుడు—ఏం ముట్టుకుంటేను?

ఆమె—మేం బ్రాహ్మలం. నాది అంటచెయ్యి...

బాలుడు—బ్రాహ్మలంటే? ఏం ఆచెయ్యి ఆ బట్టతో తుడుచుకోకూడదు?

ఆమె—అబ్బె! పాప! అల్లా తుడుచుకోకూడదు. కడుక్కోవాలి.

బాలుడు—అయితే మాఅమ్మ బట్టతో తుడుచు కొంటుందేం రోజూను.

[లోపల్నుంచి "ఎవరితోనే ఆవెధవకబుర్లు" అంటూ ఓఏభైఏళ్ళమనిషి వచ్చాడు. కళ్ళు చాలాక్రూరంగా ఉన్నాయి. ముఖంలోంచి ఒకనల్లనిరాక్షసకళ పైకి అప్రయత్నంగా చిమ్ముకొస్తుంది.] ఆముష్టివెధవ ఎవరు?

ఆమె— ........

ఆతడు—ఆవెధవ ఎవరే లోపలి కొచ్చేస్తున్నాడు?

ఆమె—వాడు ముష్టివాడే. అన్నంలేక వడకొట్టి వీథిలోపడిపోతే తీసుకొచ్చాను గుప్పెడుఅన్నం పెడదామని.

బాలుడు—[కంచం నెత్తిమీద బోర్లించుకొని రెండుచేతులతోటి నొక్కుకొంటూ ఆవెర్రికేకలకి నవ్వుతో ఆతనికేసి ఆమెకేసి దీనంగా చూస్తూంటాడు.]

ఆతడు—ఎక్కడుంది అన్నం. అంతమిగిలేట్లా వండావేమిటి?

ఆమె—అబ్బె! లేదు. నే నింకా భోంచెయ్యలేదు కామా దాల్లోది కొంచెం పెడదామని.

ఆతడు—ఇల్లాటి వెధవపనులు ఎప్పుడూ చెయ్యకు. ఆవెధవని వీథిలోకి గెంటి తలుపేసి రా.

బాలుడు—ఆఁ! నేవెళ్ళను. నిన్నే గెంటేస్తా.

ఆతడు—ఓరివెధవా! [అని కోపంతో గభీల్ని దగ్గరకి వస్తాడు కొట్టటానికి.

[కుర్రాడు ఆమెవెనక్కాలికివెళ్ళి ఆమెకొంగు నెత్తి మీద ముసుకేసుకొని] 'అమ్మా! చూ డేల్లాకొడుతున్నాడో? అన్నాడు.]

ఆతడు—ఓరివెధవా దాన్ని ముట్టుకొని తగలేశావు కళ్ళు పీకేస్తాను వెధవా.

ఆమె—అబ్బా మీ కెందు కండి ఇన్నిగొడవలు. [శాంతంగా.] చిన్నపిల్లవాడు. కడుపుమండుతోందని ఏడుస్తుంటే ఇంతఅన్నం పెట్టొద్దంటారు. నాదాల్లోది పెడతానంటే మీకేం?

ఆతడు—నోరుమూసి ఆవెధవని వీథిలో పారేసి తలుపేసిరా. తరవాత నీసని చెపుతా. ఇల్లా దెబ్బలాటలు వస్తాయనే వీథితలుపు వాడకం మానిపించేను. పెరటిదారిని ఈవెధవవ్రతకం ప్రారంభించావూ? ఓసి .....

ఆమె—మనింటివీథితలుపు వాడకం మానేశాక యాయివారబ్రాహ్మడేనా రావటం మానేశాడు కదా? ఎప్పుడోవచ్చిన ఈకుర్రాడికి ఇంతఅన్నం పెడితేనేం? కుర్రాడు. తెలీదు. పెరటిదారిని వచ్చాడు.

ఆతడు—ఛీ! ఇంక ఇల్లాకాదు. ఒరేయి వెధవా—

బాలుడు—నీతో మాటాడను ఫో.

ఆతడు—ఓరి కొంటివెధవా అవతలికి పోతావా పోవా.........

బాలుడు—[కంచం కింద పారేసి కిందపడి దొర్లుతూ] నా కాకలేస్తుందోయి. నాకడుపుమండిపోతోందోయి. [అని ఏడ్చును]

ఆతడు—ఒక్కలెంపకాయ కొడతా వెధవా? దొంగఏడుపు ఏడిచావంటే.

బాలుడు—[ఏడ్చును]... .....

ఆతడు—పోనీ ఆ అంటగిన్నెలు తోముతావా? ఇంతగంజి పోస్తాం?

బాలుడు—[కోపంతో] నే తోమను ఫో......

ఆతడు—[ఆచిన్నబుగ్గమీద లెంపకాయ కొట్టును]

ఆమె—పెట్టకపోతే అవతలికి పంపించేయండి. కుర్రాణ్ణి బుగ్గమీద కొడతా రేమిటి? [అని ముఖం

అటుతిప్పుకొని కొంగుతో కన్నీళ్ళు తుడుచుకొనును.]

బాలుడు—బాబో... అయ్యో... ఆకలి ..

అతడు—అంటగిన్నెలు తోముతావా? పోతావా?

బాలుడు—[ఏడుస్తూ] గిన్నెలు తోముతే నా చేతులు రక్తం వోస్తుంది. [అయ్యో ఆకలి అని దొల్లును]

అతడు—[పిల్లవాడిచెవిపట్టుకొని లేవతీసి] కొంటి వెధవా ఏమి టీతెగసాగు [రెండు లెంపకాయలుకొట్టి] [గుమ్మంమీంచి కిందకి తోసేసి అటుకేసి చూడకుండా తలుపువేసేసి వెనకచాటునే వచ్చి 'దొంగముండా! ముష్టివెధవల్ని లోపలికి తీసుకొనివచ్చి అదీ ఇదీ పెడుతున్నావా' అని నడ్డిమీద ఒక్కతన్ను తన్నును.]

[ఆమె అయ్యో అని ఎదటి పడిమీద పడిపోవును.]

* * *

[పెరటిగుమ్మందగ్గర రెండువందలకుంది మరాఠీ వాళ్ళు నిలబడిఉన్నారు విచ్చుకత్తుల్తో. వాళ్ళమధ్యని పిల్లవాడొకడు స్మృతిలేకుండా పడుంటాడు. ఏమిటో ఏదో భాషలో పెద్దగందరగోళం జరుగుతోంది. మేడమీంచి చూస్తున్నాడు మన 'అతడు' అనేవాడు. ఒళ్ళంతా కంపం బయలుదేరింది. గాభరా అయిపోతున్నాడు. వాళ్ళంతా ఒక్కమాటు నిశ్శబ్దంగా ఆగిపోయారు. పెద్దగడ్డంగల ఓమనిషి బహుశ వాళ్ళ గూడెంపెద్ద అయిఉండవచ్చు ఎదటికివచ్చి వాళ్ళ భాషలో ఏదో వాళ్ళమతాచారాన్ని చెప్పి చివర్ని తెనుగులోమాత్రం "సంపి రండి" అని ఆడవాళ్ళని తీసుకొని వెళ్ళిపోయాడు. మేడమీద నిల్చున్న అతడు ఈ'సంపి రండి' అనే ముక్కవిని కిందికి గబగబా పరుగెత్తుకు వచ్చాడు. కళ్ళు జిగేలు మనే దృశ్యం భయంకరంగా ఉంది. ఎదుట భార్య చచ్చి పడినట్టుంది. పక్కనిసాన. దానిప్రక్కని ముత్యాలహారం. ముత్యాలహారంలో ఉండే వజ్రము సగంఅరిగి పొడిఅయిపోయి ఉంది. ఇంతట్లోకి పెరటిగోడ పెళ్ళి విరిగి పడిపోతుంది. బిలబిల మరాఠీలు లోపల ప్రవేసిస్తారు

అతడు బిక్కమొకంవేసుకొని నిల్చుని ధైర్యంగా 'పోలీసు. పోలీసు'' అని కేక వేసి 'ఒరే రిసాల్దారు ఇల్లా పట్రా' అంటాడు అంతే నడినెత్తిమీద ముప్ఫాయి కర్రదెబ్బ లొక్కమాటు పడతాయి.

కుర్రాణ్ణి గూడాన్కి తీసుకుపోయి వాళ్ళమతానుసారంగా చెయ్యవలసిన అంత్యకర్మలుచేసి పాతిపెట్టి దానిపైన పెద్దగోరీ కట్టించారు.

—క్రా చంద్రశేఖరము.

# అశ్రుగీతి

గుబురుకొన్న వేసటతోడఁ గుములుచున్న
నన్ను వీక్షింప దొకప్రేమనయన మేని;
నావిషాదతప్తాక్రందనమ్ము వినియుఁ,
గురియ దురుబాష్ప మొకజాలిగుండెయేని!

తమమె నెలకొను నాజీవితమ్ములోన
తేవలపుదుమారము గుబాళింపఁబోదు;
సురవిలాససుమరేఖ సొగయఁబోదు;
ఇంత వలవంతబ్రతుకు సాగించు టెట్లు?

ప్రేమభిక్షుకై శర్వరీవీథులఁబడి
దీనగళమెత్తి విలపించినాను కాని—
తెరువలేదు కవాట మొక్కరును గూడ
భౌతికక్లేశ కృపణ ప్రపంచమందు.

క్రమసౌఖ్యదమ్మంచు లోకమ్ము కనుల
నీడ నాసించి యిటు వచ్చి నిలచినాఁడ;
ప్రజ్వలోన్మేష హాలహాలప్రవృద్ధ
నృత్తధూమం బటంచు నూహింపలేక.

దివ్యపిచ్ఛిల పరిమళదీపితంబు
మామకీన జీవితకుసుమమ్మునందు
ప్రబల నిశ్వాస విషవహ్ని రగులుకొలిపి
నవ్వుచున్నది జగము రంగైనమోవి!

—ఓలేటి సీతారామమూర్తి.